RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY


తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 46

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 16 జూలై 2026




# పట్టిసీమ వల్లే కృష్ణా డెల్టాకు సిరులు

● 2015 నుంచి ఇప్పటి వరకూ 450 టీఎంసీల తరలింపు ● పోలవరం లాంటి ప్రాజెక్టులపై గత పాలకుల నిర్లక్ష్యం దేశద్రోహం ● గోల్డెన్ క్వాడ్రిలేటరల్ లాగే నదుల అనుసంధానం జరగాలి ● వంశధార నుంచి పెన్నా వరకూ రివర్ లింకేజ్ లక్ష్యం ● ఎన్టీఆర్ జిల్లా పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు సీఎం జలహారతి ● కేఎల్ రావు 124వ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులు









**అమరావతి, కలంకౌంటర్ :** పట్టిసీమ ప్రాజెక్టు వల్లే కృష్ణా డెల్టాలో రైతులు సిరులు పండించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2015 నుంచి ఇప్పటి వరకూ పట్టి సీమ ప్రాజెక్టు నుంచి 450 టీఎంసీల గోదావరి వరద జలాలను తరలించినట్టు వెల్లడించారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టి సీమ డెల్టాతో పాటు రాష్ట్రంలో విలువైన సంపద సృష్టికి కారణమైందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా–గోదావరి నదుల పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు ముఖ్యమంత్రి జల హారతి ఇచ్చారు. సంప్రదాయ పంచె కట్టులో వచ్చిన ముఖ్యమంత్రి కృష్ణా- గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు- కుంకుమలు సమర్పించారు. అనంతరం ప్రముఖ ఇంజనీరు కేఎల్ రావు 124వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "సాగునీటి రంగానికి సేవలు అందించిన కేఎల్ రావుగారి 124 జయంతిని పురస్కరించుకుని ఇంజనీరుగా స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ఆయన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పట్టి సీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయి. ఏడాదిలో పట్టి సీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీది. 80 టీఎంసీలతో

- 2లో

# ఆసుపత్రి నుంచి పవన్ కళ్యాణ్ డిశ్చార్జ్

● హైదరాబాద్ లోని నివాసానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి

● వైద్యుల సూచన మేరకు మూడు వారాల తరువాత నుంచి ఫిజియోథెరపీ





**ముంబయి,కలంకౌంటర్ :** ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొద్దిసేపటి క్రితం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. శస్త్ర చికిత్స నుంచి కోలుకుంటున్న ఆయన డిశ్చార్జ్ అనంతరం నేరుగా హైదరాబాద్ లోని తన నివాసానికి చేరుకుంటారు. మూడు వారాల తరువాత నుంచి ఫిజియోథెరపీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్ చేసిన భుజం సాధారణ స్థితికి చేరుకోవడానికి నాలుగు నెలల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు.

# చంద్రబాబు సానుభూతిపరులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు: జగన్

● భీమవరంలో ఆక్వా రైతులతో జగన్ ముఖాముఖి ● ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని విమర్శ ● చంద్రబాబు ప్రతి అడుగు మోసమేనని మండిపాటు





**భీమవరం,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో ఉందని, ఆక్వా రైతులు దీనావస్థలో ఉన్నారని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన జగన్... ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలకు హేతుబద్ధత ఉండాలని, ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. దున్నపోతు మీద వాన పడినట్టు ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. ఆక్వా రంగం ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని జగన్ తెలిపారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీడ్, సీడ్ రేట్లు చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని, చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఫీడ్ రేట్లు కేజీకి రూ.14 నుంచి 16కి ఎడాపెడా పెంచేశారని, ముష్టి వేసినట్లు కేజీకి రూ.2 తగ్గిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రేట్లు పెంచితే పెంచేస్తారని... రేట్లు తగ్గితే తగ్గించరా అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం 'అప్సడా' ఏర్పాటు చేశామని... సీడ్, ఫీడ్, మార్కెటింగ్‌లో సమస్యలు వస్తే పరిష్కరించామని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక 'అప్సడా'ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నామని, రొయ్యలకు మద్దతు ధర తగ్గకుండా మానిటర్ చేశామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర తగ్గకూడదని చట్టం చేశామన్నారు. ఈరోజు కేజీ కౌంట్ రూ.230లు దాటని పరిస్థితి ఉందని చెప్పారు. ఆక్వా రైతులకు తాము 1.50కే యూనిట్ విద్యుత్ అందించామని, ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.401 కోట్ల సబ్సిడీ బకాయిలు చెల్లించామన్నారు. చంద్రబాబు ప్రతి అడుగు మోసమని విమర్శించారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

# మహిళలకు అభయం - సమాజానికి గౌరవం

● అనకాపల్లి జిల్లా పోలీసుల సరికొత్త వినూత్న సేవ: 'అభయ' ఘనంగా ప్రారంభం





**అనకాపల్లి జిల్లా/నక్కపల్లి, కలంకౌంటర్ :** మహిళల భద్రత, రక్షణ మరియు సాధికారత ధ్యేయంగా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన "అభయ" ప్రత్యేక కార్యక్రమమును బుధవారం నాడు నక్కపల్లి సమీపంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద గల భారతీ కన్వెన్షన్ హాల్లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ వినూత్న కార్యక్రమాన్ని గౌరవ రాష్ట్ర హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రివర్యులు శ్రీమతి వంగలపూడి అనిత గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ వేదికపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ కృష్ణన్, IAS గారు, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ తుహిన్ సిన్హా, IPS గారు, మరియు జాయింట్ కలెక్టర్ శ్రీ శౌర్య మాన్ పటేల్, IAS గారు గౌరవ సమక్షులుగా పాల్గొన్నారు.

**మహిళల రక్షణే ప్రథమ ప్రాధాన్యత:** ఈ సందర్భంగా గౌరవ హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత గారు మాట్లాడుతూ, మహిళల రక్షణే ఈ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ప్రకటించారు. 'అభయ' కార్యక్రమం ద్వారా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ మహిళల రక్షణ కోసం ఒక అద్భుతమైన కవచాన్ని నిర్మించిందని, మహిళలు ఏ సమయంలోనైనా భయం లేకుండా జీవించే వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. వేధింపులకు గురవుతున్నా, సైబర్ నేరాల బారిన పడుతున్నా మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పథకం కేవలం ఒక కార్యక్రమం కాదు, మహిళల ఆత్మగౌరవానికి మరియు సాధికారతకు ఒక బలమైన పునాది అని

- 2లో



# ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పించిన వైయస్ జగన్





**భీమవరం,కలంకౌంటర్ :** భీమవరంలో ఆక్వా రైతులతో నిర్వహించిన సమావేశం ప్రారంభానికి ముందు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# కలక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 30న జిల్లాకలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యాదర్శి మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. ఉయ్యూరులో వంట గ్యాస్ సిలిండర్లు చేరవేసే కార్మికులు, పెట్రోల్ బంక్ లో పనిచేసే వారిని బుధవారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలీచాలనీ వేతనాలు, జీతాల తో ఎంతో కాలంగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న కార్మికుల వేతనాలు, జీతాలు పెం చడంతో పాటి ఇతర సమస్యలు పరిష్కారం కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాకు తరలి రావాలన్నారు. సీఐటీయూ మండల నాయకుడు బి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి నివాళులు అర్పించిన రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్





**అమరావతి,కలంకౌంటర్ :** ప్రభుత్వ ఆదేశాలతో కాకినాడ జిల్లా కిర్లంపూడికి వెళ్లిన మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వం తరపున ముద్రగడ నివాసంలో ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు సమర్పణ ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రులు దుర్గేష్, సుభాష్

# ముద్రగడ పాడె మోసిన జగన్



**కిర్లంపూడి,కలంకౌంటర్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి వైసీపీ అధినేత జగన్ నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన జగన్, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ పార్థివ దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పిస్తున్నారు. కాసేపటి క్రితం ముద్రగడ అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రగడ పాడెను జగన్, వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మోశారు.

# పట్టిసీమ వల్లే కృష్ణా డెల్టాకు సిరులు

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణా డెల్టాలోని 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. నాకు ఎక్కడ పేరు వస్తుందో అని నాడు పట్టి సీమ నిర్మిస్తుంటే కొందరు విమర్శించారు. పట్టి సీమ, ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకుని ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేస్తే కృష్ణా డెల్టా ఏమయ్యేదో. విమర్శలు పట్టించుకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు చేసి పట్టి సీమ పూర్తి చేశాం. గోదావరి నుంచి కృష్ణా నదికి 450 టీఎంసీల వరద జలాలను తీసుకువచ్చాం. పట్టి సీమకు చేసిన ఖర్చుతో కృష్ణా డెల్టా మొత్తం స్థిరీకరణ జరిగింది. ఎకరాకు రూ.1200 ఖర్చు అవుతోంది. వనరులు వృధా కాకుండా రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. వచ్చే వరద జలాలను సముద్రానికి వదిలేసి ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవటం తెలివైన పని అనిపించుకోదు. పట్టి సీమ నీటితో కృష్ణా డెల్టాలో రైతులు బంగారం పండిస్తున్నారు. పోలవరం కుడి కాలువ నుంచి నీటి తరలింపు కారణంగానే శ్రీశైలంలో కృష్ణా నీటిని పొదుపు చేసి రాయలసీమకు నీరందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకి సాగునీరు అందించాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ప్రాజెక్టులపై గత పాలకుల నిర్లక్ష్యం..** 2014–19 మధ్య రూ.68 వేల కోట్లు సాగునీటి రంగానికి ఖర్చు చేశాం. 2024 నుంచి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు పెట్టాం. గత పాలకులు అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకు పోయినా మాట్లాడలేదు. ప్రాజెక్టుల మరమ్మతులకు పైసా ఇవ్వలేదు, గ్రీజు కూడా పూయలేదు. తుంగభద్ర డ్యామ్ కు కొత్త గేట్లను ఏర్పాటు చేయించాం. నిన్న ధవళేశ్వరం బ్యారేజికి కూడా రూ.152 కోట్లుతో కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించాం. 2014–19లో పోలవరం ప్రాజెక్టులో 72 శాతం పనులు పూర్తి చేశాం. గడచిన రెండేళ్లలో ప్రాజెక్టును 89 శాతం మేర పూర్తి చేశాం. కానీ 2019–24 మధ్య కనీసం 2 శాతం కూడా పనులు చేయలేదు. పూర్తి నిర్లక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కూడా కొట్టుకు పోయేలా చేశారు. అతి ముఖ్యమైన ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం చేయటం దేశ ద్రోహం, రాష్ట్ర ద్రోహం. ప్రాజెక్టులను గాలికి వదిలేసిన గత పాలకులు రాష్ట్ర రైతులకు ద్రోహం చేశారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారు. ప్రతిపక్షంలోని కొందరు రైతుల్ని రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

**సాగునీటికి ఎక్కువ నిధులు..** వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులు అనుసంధానం జరగాలన్నదే నా ఆకాంక్ష. గోల్డెన్ క్వాడ్రిలేటరల్ తరహాలో నదులు అనుసంధానమైతే భారత్ దేశానికి తిరుగు ఉండదు. సముద్రంలోకి వెళ్లే నీటిని సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తే పెద్ద ఎత్తున సంపద సృష్టి జరుగుతుంది. ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో పూర్తి చేస్తాం.ఈ ఏడాది జూన్ లో తుంగభద్ర ప్రాజెక్టు కు కొత్త గేట్లు ఏర్పాటు చేసి ప్రారంభించాం. కాటన్ బ్యారేజికి కూడా కొత్త గేట్ల పనులు ప్రారంభించాం. వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తి అవుతాయి. గుంటూరు ఛానల్ ఆధునీకరణ పనులకు కూడా ఈ నెలలోనే శంకుస్థాపన చేసి రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పూర్తి అయ్యింది. ఆగస్టు 14 తేదీన గోదావరి జలాలకు అనకాపల్లి వద్ద స్వాగతం పలుకుతాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ను 2026 సెప్టెంబరు 1 తేదీన జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టులో రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్ లో ఉన్నా గత పాలకులు ప్రాజెక్టు



ప్రారంభించామని నాటకాలు ఆడారు. సొరంగంలో టన్నెల్ బోరింగ్ యంత్రం ఇరుక్కు పోయి ఉన్నా జాతికి అంకితం అన్నారు. గత పాలకులు చేసిన మోసాన్ని కూడా ప్రజలకు చెబుతాం. రాష్ట్రంలో కురిసే ప్రతీ వర్షపు చుక్కనూ భూగర్భ జలంగా మార్చుకోవాల్సి ఉంది. జలధార కింద ఈ పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. రాష్ట్ర భవిష్యత్తుకు విరోధంగా పనిచేసే వారి పట్ల మనం అంతా అప్రమత్తంగా ఉండాలి. " అని ముఖ్యమంత్రి అన్నారు.

**సాగునీటి రంగంలో కేఎల్ రావుది ఎనలేని కృషి..** శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్ ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారు. ఐక్యరాజ్య సమితి తరపున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారు. విజయవాడలో జన్మించి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్ర మంత్రిగా పనిచేశారు. నీటి పారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారు. శివ రామకృష్ణయ్య, కేఎల్ రావుల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా నాకు ఎంతో స్ఫూర్తి. జలధార కార్యక్రమంతో భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా చర్యలు చేపట్టాం. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ సహా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

**వచ్చే 3 ఏళ్లలో ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసే 36 సాగునీటి ప్రాజెక్టుల వివరాలు..** 1 తుంగభద్ర కొత్త గేట్లు 25-06-2026 ప్రారంభోత్సవం పూర్తి 2 కాటన్ బ్యారేజ్ గేట్లు 13-07-2026 శంకుస్థాపన పూర్తి 3 గుంటూరు ఛానల్ ఆధునీకరణ 31-07-2026 శంకుస్థాపన 4 పోలవరం ఎడమ ప్రధాన కాలువ 14-08-2026 ప్రారంభోత్సవం 5 పెరూరు బ్రాంచ్ కెనాల్ - ప్యాకేజీ 36లూ 04-08-2026 శంకుస్థాపన 6 వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్ - 1 01-09-2026 ప్రారంభోత్సవం 7 పాలేరు రిజర్వాయర్ 10-09-2026 శంకుస్థాపన 8ఖ హెచ్.ఎన్.ఎస్.ఎస్. ఫేజ్-2 (400 - 490 కి.మీ) 31-10-2026 ప్రారంభోత్సవం ఎ హెచ్.ఎన్.ఎస్.ఎస్. ఫేజ్-2 (490 - 554 కి.మీ, అడవిపల్లి వరకు) 30-06-2027 ప్రారంభోత్సవం 9 నెరడి బ్యారేజ్ 30-11-2026 శంకుస్థాపన 10 పెన్నా-సర్వేపల్లి రిజర్వాయర్ 31-12-2026 ప్రారంభోత్సవం 11 మడ్డువలస స్టేజ్-2 31-01-2027 ప్రారంభోత్సవం 12 జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్ట్ 31-01-2027 ప్రారంభోత్సవం 13 పోలవరం సాగునీటి ప్రాజెక్ట్ 31-03-2027 ప్రారంభోత్సవం 14 హీరమండలం ఎత్తిపోతల పథకం 30-04-2027 ప్రారంభోత్సవం 15 నీవా బ్రాంచ్ కెనాల్ (నీవా నది వరకు) 30-06-2027 ప్రారంభోత్సవం 16 నాగావళి - చంపావతి నదుల అనుసంధానం 30-06-2027 ప్రారంభోత్సవం 17ఖ బుడమేరు (ఎనికేపాడు యూటీ) 30-06-2027 ప్రారంభోత్సవం 17ఎ బుడమేరు డైవర్షన్ ఛానల్ (బి.డి.సి) 30-06-2027 ప్రారంభోత్సవం 18 ముక్త్యాల ఎత్తిపోతల పథకం 30-06-2027 ప్రారంభోత్సవం 19 వంశధార ఫేజ్-2, స్టేజ్-2 01-07-2027 ప్రారంభోత్సవం 20 చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1 31-07-2027 ప్రారంభోత్సవం 21 మహేంద్రతనయ ఆఫ్-షోర్ రిజర్వాయర్ 15-07-2027 ప్రారంభోత్సవం 22 గజపతినగరం బ్రాంచ్ కెనాల్ 31-07-2027 ప్రారంభోత్సవం 23 తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్ 20-07-2027 ప్రారంభోత్సవం 24 ఖ అల్లూరుపాడు ఎత్తిపోతల 30-09-2027 ప్రారంభోత్సవం b అల్లూరుపాడు రిజర్వాయర్ 30-09-2027 ప్రారంభోత్సవం c అల్లూరుపాడు నుండి మెర్లపాక వరకు ఎస్.ఎస్.ఎల్.సి 30-09-2027 ప్రారంభోత్సవం d మల్లెమడుగు ఎత్తిపోతల 30-09-2027 ప్రారంభోత్సవం e మల్లెమడుగు రిజర్వాయర్ 31-12-2027 ప్రారంభోత్సవం f బాలాజీ రిజర్వాయర్ 31-03-2028 ప్రారంభోత్సవం 25 కళ్యాణి డ్యామ్ కోసం ములపల్లి ఎత్తిపోతల పథకం 15-12-2027 ప్రారంభోత్సవం 26 మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ 31-12-2027 ప్రారంభోత్సవం 27 తారక రామ తీర్థసాగరం ప్రాజెక్ట్ 30-12-2027 ప్రారంభోత్సవం 28 వేదవతి ఎత్తిపోతల పథకం 30-06-2028 ప్రారంభోత్సవం 29 భైరవానితిప్ప ఎత్తిపోతల పథకం 30-06-2028 ప్రారంభోత్సవం 30 అప్పర్ పెన్నా ప్రాజెక్ట్ 30-06-2028 ప్రారంభోత్సవం 31 కడప నగరం వం-కు జి.ఎన్.ఎస్.ఎస్ 30-06-2028 ప్రారంభోత్సవం 32 గోదావరి డెల్టా వ్యవస్థ ఆధునీకరణ 30-06-2028 ప్రారంభోత్సవం 33 వరికుడిసేల ప్రాజెక్ట్ 15-12-2028 ప్రారంభోత్సవం 34 ఎస్.ఆర్.ఎం.సి మరియు ఎస్.ఆర్.బి.సి అప్‌గ్రేడేషన్ 31-12-2028 ప్రారంభోత్సవం 35 జి.ఎన్.ఎస్.ఎస్ కడప నుండి కొడూరు వరకు 31-12-2028 ప్రారంభోత్సవం 36 జి.ఎన్.ఎస్.ఎస్ కొడూరు - మల్లెమడుగు - బాలాజీ రిజర్వాయర్ 31-12-2028 ప్రారంభోత్సవం

# మహిళలకు అభయం - సమాజానికి గౌరవం

## ● అనకాపల్లి జిల్లా పోలీసుల సరికొత్త వినూత్న సేవ: 'అభయ' ఘనంగా ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఆమె పేర్కొన్నారు.

**మూడు శాఖల సమన్వయం - సురక్షిత ప్రాంతాల ఏర్పాటు:** అనంతరం గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ కృష్ణన్, IAS గారు ప్రసంగిస్తూ, జిల్లాలో మహిళా సాధికారత, భద్రతను పటిష్టం చేయడానికి ఈ 'అభయ' కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని, ఈ అద్భుతమైన చొరవను తీసుకున్న జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. కేవలం పోలీసుల పరంగానే కాకుండా, జిల్లా యంత్రాంగం తరఫున రెవెన్యూ, పోలీస్, మరియు మహిళా–శిశు సంక్షేమ శాఖల (WCD) సమన్వయంతో తామంతా కలిసి పనిచేస్తామని, క్షేత్రస్థాయిలో ప్రతి మహిళకు అత్యంత వేగవంతమైన సేవలు, భద్రత అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**'మీ భద్రత... మా బాధ్యత' & తగ్గిన నేరాల శాతం:** జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, IPS గారు మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం 'మీ భద్రత... మా బాధ్యత' అనే నినాదంతో ఈ 'అభయ' ప్రాజెక్టును అత్యంత ప్రణాళికాబద్ధంగా తీసుకువచ్చామని తెలిపారు. అనకాపల్లి జిల్లా పోలీసుల నిరంతర కృషి ఫలితంగా జిల్లాలో మొత్తం నేరాల రేటు 28.42% మేర తగ్గడం విశేషమని ఆయన గర్వంగా ప్రకటించారు. ?ఈ ప్రాజెక్టు కింద మొత్తం 10 ప్రధానాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెబుతూ, స్కూళ్లు, కాలేజీలలో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో 'శక్తి బీట్' అధికారులను, శక్తి టీమ్స్ మరియు ఉమెన్ సేఫ్టీ బీట్స్ వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తున్నామని వివరించారు. బాధితులకు గృహాల వద్దే కౌన్సిలింగ్ ఇవ్వడం, నిరంతరం వేధించే నేరస్థులపై రౌడీ షీట్లు తెరవడం, సోషల్ మీడియాలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు మరింత బాసటగా నిలిచేందుకు 'వన్ స్టాప్ సెంటర్' మరియు కదలికల ద్వారా అవగాహన కల్పించే 'అవేర్‌నెస్ ఆన్ వీల్స్' సేవలను కూడా జోడించామని వివరించారు.

**ఈ 'అభయ' కార్యక్రమం ప్రధానంగా 5 రక్షణ సూత్రాలపై**




**నడుస్తుంది:** నివారించండి: సమాజ భాగస్వామ్యం, రెస్పాన్సిబుల్ సోషల్ మీడియా వాడకం ద్వారా మహిళలపై జరిగే నేరాలను ముందస్తుగా నియంత్రిస్తారు. రక్షించండి: ఆపద సమయంలో తక్షణ రక్షణ మరియు భద్రతను చేకూరుస్తారు. అండగా ఉండండి: బాధితులకు మానసిక, వైద్య మరియు చట్టపరమైన భరోసా కల్పిస్తూ ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తారు. న్యాయం చేయండి: సత్వర దర్యాప్తు జరిపి నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా చార్జ్‌షీట్లు దాఖలు చేస్తారు. శక్తివంతం చేయండి: చట్టాలపై విస్తృత అవగాహన కల్పించి మహిళల ఆత్మవిశ్వాసాన్ని, సాధికారతను పెంచుతారు.

**మహిళలపై జరిగే నేరాలను గుర్తించండి - అప్రమత్తంగా ఉండండి!** ?ఈ కార్యక్రమంలో మహిళలపై జరుగుతున్న నేరాలు మరియు సైబర్ క్రైమ్స్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా రూపొందించిన అవగాహన వీడియోలను ప్రదర్శించారు. ముఖ్యంగా మహిళలు సమాజంలో మరియు ఆన్‌లైన్‌లో ఎదుర్కొనే క్రింది నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు: గృహ హింస, కార్యాలయాల్లో లైంగిక వేధింపులు, ఆఫ్‌లైన్ ఌ ఆన్‌లైన్ వేధింపులు, ఈవ్ టీజింగ్ / పబ్లిక్ హరాస్‌మెంట్ లైంగిక దాడి / దాడులకు ప్రయత్నించడం, సైబర్ బుల్లీయింగ్ ఌ ఆన్‌లైన్ వేధింపులు, ఫోటోల మార్ఫింగ్ మరియు రివెంజ్ పోర్న్, బాల్య వివాహాలు గుర్తుంచుకోండి: "మౌనంగా ఉండటం నేరస్థుడిని కాపాడుతుంది.. సమాచారం ఇవ్వడం ఇతరులను రక్షిస్తుంది."

ఆపదలో ఉన్నారా? కేవలం ఒకే ఒక్క కాల్ దూరంలో సహాయం! ?మహిళలు నేరుగా తమ సమస్యలను అధికారుల దగ్గరికి తీసుకువెళ్లేందుకు వీలుగా ప్రత్యేకంగా రూపొందించిన "అభయ పోస్టర్లు" మరియు "అభయ ఫిర్యాదుల పెట్టెలను" గౌరవ హోంమంత్రి గారు మరియు ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. మహిళల తక్షణ రక్షణ మరియు సహాయం కోసం అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లను నిరంతరం అందుబాటులో ఉంచింది. ఏ క్షణంలోనైనా ఆపద ఎదురైతే వెంటనే సహాయం పొందేందుకు దేశవ్యాప్త అత్యవసర పోలీస్ సహాయ నంబర్ 112 కు కాల్ చేయవచ్చు. అలాగే ప్రత్యేక మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, మరియు సైబర్ నేరాల బారిన పడితే తక్షణమే ఫిర్యాదు చేయడానికి సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 లను సంప్రదించవచ్చు. వీటితో పాటు మహిళలు తమ ఫిర్యాదులను సులువుగా పంపించేందుకు వీలుగా ప్రత్యేక వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 7993485111 కూడా 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది.

**మహిళల భద్రత కోసం ఈ క్రింది ప్రతిజ్ఞను పూనారు:** నేను ప్రతి మహిళను, ఆడబిడ్డను గౌరవిస్తాను. నా కళ్లెదుట వేధింపులు జరిగితే నేను మౌనంగా ఉండను. అత్యవసర పరిస్థితుల్లో నేను వెంటనే 112 నంబర్‌కు కాల్ చేస్తాను. బాధితులకు అండగా ఉంటూ, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తాను. ఈ భారీ బహిరంగ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా పంచాయతీ ఆఫీసర్ శ్రీ సందీప్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ శ్రీమతి ఎం.సూర్యలక్ష్మి, డీఆర్డీఏ పీడీ శ్రీమతి సచిదేవి, అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన రావు, డీఎస్పీలు శ్రీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీ జీ.ఆర్.ఆర్.మోహన్, శ్రీ బి.మోహనరావు, శ్రీ ఈ.శ్రీనివాసులు, శ్రీ కె.రవికుమార్, సిఐలు బాల సూర్యారావు, రేవతమ్మ, మురళి, రామకృష్ణ, వినోద్ బాబు, గోవిందరావు, రామకృష్ణారావు, ఎస్సైలు సన్ని బాబు, ఉమామహేశ్వరరావు, విజయ్ కుమార్, ఆలీ షరీఫ్, రమేష్, పురుషోత్తం మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం

- వాతావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కుంటున్నాం
- దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సీఎం గాడిన పెడుతున్నారు
- వరుసగా రెండో ఏడాది ట్రూ డౌన్ అమలు చేయబోతున్నాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతికలంకౌంటర్ :** దేశంలో ట్రూ–అప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూ–డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్




వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్పకాలంలోనే గాడిలో పెట్టారని మంత్రి అన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన Rs.6,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతున్నాయని, నిర్ణీత గడువులో అవసరమైన అన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

**అమరావతి, కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో వేలకోట్లు దోచుకున్నారు

- ఓబులాపురంలో దోచుకున్న సొమ్ముతోనే సాక్షి పేపర్, టివి పెట్టారు
- ఐదేళ్ల పాలనలో కడప జిల్లాకు జగన్ చేసింది శూన్యం
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం
- ఈనెల 24న తల్లికి వందనం నిధులను జమ చేయబోతున్నాం
- ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్



**ప్రొద్దుటూరు,కలంకౌంటర్ :** జగన్మోహన్ రెడ్డి రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ, జగన్ అధికారంలో ఉండగా కడపజిల్లాకు ఒక్క పరిశ్రమను సీమకు తీసుకురాకపోగా, ఇక్కడ సంపదనంతా అడ్డగోలుగా దోచుకున్నారని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రొద్దుటూరు సమీపంలోని దొరసానిపల్లిలో నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో 11వేల ఎకరాలను రూ.18వేల చొప్పున, మరో 3వేల ఎకరాలను రూ.25వేల చొప్పున భూములు తీసుకున్నారు, యువతకు 10వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పేర్చకుండా, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశారు. ఓబులాపురం గనుల్లో విచ్చలవిడిగా ఐరన్ ఓర్ తవ్వేసి రెడ్ గోల్డ్ పేరుతో విదేశాలకు తరలించి వేలకోట్లు దోచుకున్నారు, అదే అవినీతి సొమ్ముతో సాక్షి పత్రిక,టివిలను కూడా పెట్టారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కడపకు జగన్ చేసింది శూన్యం, చివరకు ఆయన నియోజకవర్గం పులివెందులకు నీళ్లు ఇచ్చింది కూడా చంద్రబాబేనని తెలిపారు. ఈరోజు దాల్మియా భారత్ విస్తరణ పనులకు మేం శంకుస్థాపన చేశాం, వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా లీగల్ నోటీసులు ఇచ్చి అడ్డుకోవడమేగాక మామూళ్ల కోసం వేధించారని అన్నారు.

**వారు ఫ్యాక్షన్ తెస్తే మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం..** చంద్రబాబు నాయుడు నాలుగోసారి సిఎం అయ్యాక రాయలసీమలో ఇదివరకెన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరుగుతోంది. జెఎస్ డబ్ల్యు స్టీల్ ప్లాంట్ కు ఇటీవల భూమిపూజ చేశారు, అంతకుముందు ఎస్ఎఇఎల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్ ను ప్రారంభించాం, జిల్లావ్యాప్తంగా స్మార్ట్ కిచెన్లు ఏర్పాటుచేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. పరిశ్రమలతోపాటు హార్టికల్చర్ ను కూడా ప్రోత్సహిస్తున్నాం. గొడ్డలి పార్టీ ఫ్యాక్షనిజం తెస్తే మేం ఫ్యాక్టరీలు తెచ్చాం, రాయలసీమలో వారు రక్తాన్ని పారిస్తే, మేం ఉద్యోగాల పంట పండిస్తున్నాం. వారు అధికారంలో ఉండగా చంద్రబాబు నాయుడును ఇంటినుంచి బయటకు రానీయకుండా గేట్లకు తాళాలు వేయించారు, ఈరోజు జగన్ స్వేచ్ఛగా ఎక్కడకు వెళ్లడానికైనా అనుమతి ఇస్తున్నాం. ఇదే ప్రొద్దుటూరులో బిసి నేత నందం సుబ్బయ్యను వైసిపి హయాంలో దారుణంగా హతమార్చారు, మేం వారి కుటుంబానికి అండగా నిలిచి, వారి బిడ్డలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలులో చదివిస్తున్నామని చెప్పారు.

**ఎంతచేసినా కార్యకర్తల రుణం తీర్చుకోలేం..**వైసిపి హయాంలో ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలే. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేం. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నాపై కోడిగుడ్లతో దాడిచేసి, భయపెట్టాలని చూశారు, జి.ఓ. నెం.1 పేరుతో పాదయాత్రను అడ్డుకోవాలని విఫలయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట కడప జిల్లా. మధ్యలో రెండు ఎన్నికల్లో ఇబ్బందిపడినా గత ఎన్నికల్లో మళ్లీ పార్టీకి గతవైభవం తెచ్చారు. అధికారంలోకి వచ్చామని కష్టకాలాన్ని మర్చిపోకూడదు. నేను పాదయాత్ర బుక్ చూసినపుడు ఆనాటి స్మృతులన్నీ గుర్తుకువస్తుంటాయి. మినీ ముంబాయిగా పేరొందిన ప్రొద్దుటూరు బంగారు వ్యాపారానికి దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇటీవల జొన్నగిరి గోల్డ్ మైన్ ను ప్రారంభించిన చంద్రబాబు గారు రాయలసీమను గోల్డ్ హబ్ గా మార్చేందుకు కృషిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ప్రొద్దుటూరులో నాలుగుసార్లు టిడిపి గెలిచింది.

**కోటిమంది కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు సహజం..** 2025 కడపలో జరిగిన మహానాడులో ఆరుశాసనాలను తీసుకున్నాం. అందులో ముఖ్యమైంది కార్యకర్తే అధినేత. దానిని చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. కోటిమందికి పైగా కార్యకర్తలున్న అతిపెద్ద కుటుంబం మనది. ఇంత భారీ వ్యవస్థలో చిన్నచిన్న సమస్యలు సహజం. బూత్, క్లస్టర్, మండల, నియోజకవర్గ, పార్లమెంటు, జోనల్ స్థాయిల్లో సమ–స్యలను పరిష్కరించుకోవాలి. ఆ దశల్లో పరిష్కారం కాకపోతే కేంద్ర కార్యాలయం దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం. కార్యకర్తల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత నాయకులందరిపైనా ఉంది. పార్టీలో సంస్కరణల కోసం నేను ఎంతో పోరాటం చేయాల్సి వచ్చింది. సమస్యలను నాలుగుగోడల నడుమ బాబుగారితో చర్చిస్తాం. బయటకు వచ్చాక జై తెలుగుదేశం, జై చంద్రబాబు అని ముక్తకంఠంతో నినదించాలి.


**క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తను గుర్తించే బాధ్యత నాది..**సీనియర్ నేత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని పార్టీ కేడర్ అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి. ప్రతిపక్షంలో ఈ నియోజకవర్గంలో అనేకమంది నేతలు నాతో కలసి నడిచారు. వారందరినీ కలుపుకొని వెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంది. పార్టీలో వర్గాలు ఉండకూడదు. వర్గాల వల్ల పార్టీ నష్టపోతుంది. నాయకులు పార్టీని నమ్మి పనిచేయండి, వారికి సరైన స్థానం కల్పించే బాధ్యత మేం తీసుకుంటాం. కష్టపడిన నాయకులను గుర్తించేందుకే మై టిడిపి యాప్ తెచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో పనిచేసే 4లక్షలమంది నాయకుల పనితీరును అంచనా వేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఏ కార్యక్రమం చేసినా మై టిడిపి యాప్ ద్వారా పార్టీ దృష్టికి తీసుకురండి. పదవులు వాటంతట అవే మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తాయి. నామినేటెడ్ పోస్టులకు ఎంపిక ప్రక్రియను చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తొలివిడతలో అవకాశం రానివారికి మలివిడతలో వస్తుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తను గుర్తించే బాధ్యత నాది.

**ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాల అమలు..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ముందుకు నడిపిస్తున్నాం. ఈనెల 24వతేదీన రెండోవిడత తల్లికి వందనం నిధులు జమ చేయబోతున్నాం. దేశంలో మరెక్కడా లేనివిధంగా రూ.4వేల పెన్షన్ అందజేస్తున్నాం. దీపం–2 పథకంలో ఏడాదికి 3 గ్యాస్ సిలండర్లు, స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు, చేనేతలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నాం. ఎన్నికల్లో హామీ ఇవ్వని అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేశాం. యువగళంలో ఇచ్చిన హామీ మేరకు 16వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీచేశాం. 10వేల పోస్టులతో జాబ్ క్యాలండర్ ప్రకటించాం. ఒకవైపు గతంలో చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ మరోవైపు సంక్షేమాన్ని పద్ధతి ప్రకారం కొనసాగిస్తున్నాం. వైసిపి హయాంలో ఆరుసార్లు విద్యుత్ చార్జీలు పెంచితే కూటమి ప్రభుత్వంలో ట్రూడౌన్ చేసి తగ్గించాం, చెత్తపై పన్ను వంటి వాటిని తొలగించాం. 60వేలకోట్ల లోటు బడ్జెట్ ఉన్నా సంక్షేమ పథకాలను సంతృప్తస్థాయిలో అందజేస్తున్నాం. మరో ఏడాది కష్టపడితే ఆర్థిక సమస్యలను అధిగమిస్తాం. సర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా ప్రజాప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం నింపాల్సిన బాధ్యత పార్టీ కేడర్ పై ఉంది.

**రాష్ట్రాభివృద్ధి కోసమే మూడు పార్టీల కలయిక..** కేవలం రాష్ట్రాభివృద్ధే ఏకైక ఎజెండాగా టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయి. ఒకరి పేరుతో మరొకరిని ఉసిగొల్పేలా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి రెచ్చగొట్టేందుకు వైసిపి పేటిఎం బ్యాచ్ ప్రయత్నిస్తారు. కూటమి కేడర్ అప్రమత్తంగా, ఐక్యంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలి. ఎట్టి పరిస్థితులు ఎదురైనా దీర్ఘకాలం కూటమి కొనసాగుతుంది. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోడీజీ అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. విశాఖ స్టీల్ కు నిధులు, రైల్వే జోన్, బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టులను రాష్ట్రానికి ఇచ్చారు. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాం. సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధాని మోడీ. ఆయన నేతృత్వంలో కలసికట్టుగా ముందుకు సాగుతాం. కార్యకర్తలు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో మాదిరిగానే పనిచేయండి. రాబోయే ఎన్నికల్లో ప్రతి బూత్, ప్రతి ఓటు మనకు కీలకమే. భారీ మెజారిటీతో నెగ్గిన మంగళగిరిలో కూడా 20 బూత్ లలో మైనస్ వచ్చింది. ప్రజలతో బంధాన్ని ఏర్పాటుచేసుకొని మమేకమై ముందుకు సాగాలని యువనేత లోకేష్ పార్టీ కేడర్ కు దిశానిర్దేశం చేశారు.

# ఆధునిక జిమ్ వీఐపీ లాంజ్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ








**విజయనగరం,కలంకౌంటర్ :** పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, వృత్తిపరమైన సామర్థ్యాల పెంపునకు ఆధునిక సౌకర్యాలు ఎంతో అవసరమని జిల్లా లిఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీస్ శిక్షణా కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక జిమ్‌తో పాటు వీఐపీ లాంజ్‌ను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ,5వ బెటాలియన్ కమాండంట్ వై.రవి శంకర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ముందుగా పండితులు పూర్ణకుంభం , మంత్రోచ్చరణతో జిల్లా ఎస్పీ బెటాలియన్ కమాండంట్ కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, రోజువారీ విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ఎంతో అవసరమన్నారు. అందుకోసం పోలీసు శిక్షణ కేంద్రాల్లో అత్యాధునిక సౌకర్యాలను కల్పించడం పోలీసు శాఖ ప్రాధాన్యతగా తీసుకుంటోందని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌లో అత్యాధునిక వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జిమ్ ద్వారా శిక్షణ పొందుతున్న పోలీసు శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం చేసి తమ ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకోవచ్చన్నారు. శారీరకంగా దృఢంగా ఉన్న పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీస్ శిక్షణా కళాశాల అనేది సమర్థవంతమైన పోలీసు బలగాల రూపకల్పనకు కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని, ఇక్కడ అందిస్తున్న నాణ్యమైన శిక్షణతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలు కూడా శిక్షణార్థుల నైపుణ్యాలను పెంపొందిం చడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ వివరించారు. అలాగే ప్రారంభించిన వీఐపీ లాంజ్‌ను ఉన్నతాధికారుల సందర్శనలు,ప్రత్యేక అతిథుల కోసం అన్ని వసతులతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. సౌకర్యవంతమైన వాతావరణంలో ప్రత్యేక అతిథులు మరియు ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించేందుకు ఈ లాంజ్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ జిమ్‌లోని ఆధునిక వ్యాయామ పరికరాలను పరిశీలించి వాటి వినియోగంపై అధికారులతో మాట్లాడారు. వీఐపీ లాంజ్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను కూడా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసి, పోలీస్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ డి.రామచంద్ర రాజు కి అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్, డి.రామ చంద్ర రాజు, అదనపు ఎస్పీలు, పి.సౌమ్యలత, పి.కిరణ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 100 మంది విద్యార్థులకు ఉచిత ట్యూషన్ చెప్పడమే లక్ష్యంగా కృషి చేస్తున్న సంయుక్త సేవా సంస్థ

- ట్యూషన్ నిర్వహణకు సహాయం చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపిన సంయుక్త అధ్యక్షుడు సురేంద్ర



**కావలి,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా, కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8:30 నిముషాల వరకు దాతలు మోహన్,పరమేశ్వరి ,ఎం చంద్రశేఖర్, లక్ష్మీ ప్రసన్న , ఎం క్రిష్ణ కిశోర్,అనూష , వాకాటి మహేంద్ర, శ్రీదేవి , జ్యోతి ప్రసాద్ ,మేఘన, శ్రీ యోగిని ,పి ఐ జాఫర్ ఖాన్ ,అంజాద్ ఆలీ ,పి సీతాలక్ష్మి ,జి.కళ్యాణి ,నేలటూరి శివప్రసాద్ రెడ్డి ,ఎన్ ప్రమీలా రాణి ,శాంతి వర్ధన్, షేక్ దిల్షాద్ ,పి వి సాయి తేజ ల సహకారంతో ఉచిత ట్యూషన్ కొనసాగిస్తూ ఉన్నారు.ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో గత 7 సంవత్సరాల నుండి దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఉచితట్యూషన్ క్లాసులు నిర్వహించడంజరుగుతోందని తెలిపారు.100 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ క్లాసులు నిర్వహించడమే తన లక్ష్యం అని తెలిపారు..ప్రస్తుతం 60 మందికి పైగా విద్యార్థులు మా సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో కొనసాగుతున్న ఉచిత ట్యూషన్ లో చేరి చదువుకుంటూ ఉన్నారని తెలిపారు .ఈ సందర్భంగా ఉచిత ట్యూషన్ నిర్వహణకు ఈ నెలలో సహాయం అందజేసిన దాతలుమోహన్,పరమేశ్వరి,ఎం చంద్రశేఖర్, లక్ష్మీ ప్రసన్న, ఎం క్రిష్ణ కిశోర్,అనూష, వాకాటి మహేంద్ర, శ్రీదేవి, జ్యోతి ప్రసాద్,మేఘన, శ్రీ యోగిని,పి ఐ జాఫర్ ఖాన్ ,అంజాద్ ఆలీ ,పి సీతాలక్ష్మి ,జి.కళ్యాణి ,నేలటూరి శివప్రసాద్ రెడ్డి ,ఎన్ ప్రమీలా రాణి ,శాంతి వర్ధన్, షేక్ దిల్షాద్ ,పి వి సాయి తేజ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.

# ఆర్టీసీ సిబ్బంది దాష్టికం -వృద్ధుడు, మహిళను నిర్ధాక్షిణ్యంగా బస్సు నుంచి దించి వేసిన ఆర్టిసి సిబ్బంది

- 33 కోట్లు బకాయి చెల్లించని వారికి చెప్పుకోండని హుకుం - ఉయ్యూరు డిఎంకు ఫిర్యాదు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు ఆర్టీసీ బస్సులో కండక్టర్ డ్రైవర్ తమ పట్ల అమానవీయంగా ప్రవర్తించి మండుటెండలో నడిరోడ్డుపై దించి వేశారని ఓ మహిళ ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కు బుధవారం ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన మంతెన రాధిక వృద్ధుడైన తన తండ్రి నాగోతి నటరాజు (70) తో కలిసి ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఉయ్యూరు కు ప్రయాణమైంది. ఆటోనగర్ నుంచి కంకిపాడు వచ్చిన ఆ ఇరువురు ప్రయాణానికి సిద్ధంగా ఉన్న ఉయ్యూరు బస్సు ( ఏపీ16జెడ్ 0230) ఎక్కేందుకు ప్రయత్నించారు.డ్రైవర్ బస్సులు నిలుప కుండా నడిపే ప్రయత్నం చేయడంతో అతనిని అభ్యర్థించారు. బస్సుకు ముందు నుంచి వృద్ధుడైన తన తండ్రిని కష్టపడి బస్సు ఎక్కించి తాను కూడా బస్సు ఎక్కింది. బస్సు ఎందుకు ఆపరని వృద్ధులను చూసి అయినా కనికరం లేదా అని ప్రశ్నించింది. దీంతో కండక్టర్ కలగజేసుకొని పరుష పదజాలంతో తనను దూషించారని ఆమె ఫిర్యాదుల పేర్కొన్నారు. తన తండ్రికి టికెట్ ఇవ్వవలసిందిగా కోరగా తాను ఇవ్వనని దిక్కునచోట చెప్పుకోమని, 33 కోట్లు బకాయి ఉండి చెల్లించకుండా ఉన్న వారిని అడగాలని కండక్టర్ తగ్గైదాకు దిగారని ఆమె ఫిర్యాదులో వివరించారు. మీరు జీతాలు తీసుకోవట్లేదా అని ప్రశ్నిస్తే కంకిపాడు ఆర్సీఎం చర్చి సెంటర్లో తనని తండ్రిని దించి వేశారని వేశారని, వృద్ధుల పట్ల మహిళల పట్ల కనీస కనికరం లేకుండా అమానుషంగా అవమానకరంగా ప్రవర్తించిన కండక్టర్ డ్రైవర్ల పై చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో డిపో మేనేజర్ ని కోరారు. ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తాము కబురు చేస్తామని తెలిపినట్లు రాధిక విలేకరులకు తెలిపారు.

# పలు సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే ఇంటూరి






**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా సమీక్ష సమావేశం ఇంచార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన బుధవారం ఒంగోలులోని ప్రకాశం భవన్ లో జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై, నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. రెవిన్యూ శాఖలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే , కలెక్టర్ రాజాబాబు దృష్టికి తీసుకువెళ్లారు. సగం పంచాయతీలకు రెగ్యులర్ వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు లేరన్నారు. 5 మండలాలకు రెండు మండలాల్లో మాత్రమే ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ లు పనిచేస్తున్నారని చెప్పారు. సిబ్బంది కొరత వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని వివరించారు. కందుకూరు లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పెరుగుతున్న రోగుల సంఖ్య దృష్టిలో ఉంచుకొని వెంటనే ఖాళీలు భర్తీ చేసి సహకరించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఇంకా పలు సమస్యలపై సమావేశంలో ఆయన మాట్లాడారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

**ఉయ్యూరు,కలంకౌంటర్ :** బోళ్లపాడులో పేకాట శిబిరం పై మంగళవారం రాత్రి దాడిచేసి పేకాటాడుతున్న7 మం దిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుండి రూ.13,800 స్వాధీన పరుచుకుని కేసు నమోదుచేసినట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై సురేశ్ కుమార్ తెలిపారు. గ్రామాలలో జూదం, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రైతు కష్టం విద్యార్థులకు తెలియాలి




**ఉయ్యూరు,కలంకౌంటర్ :** విద్యార్థి దశ నుండి పిల్లలకు వ్యవసాయం రైతు కష్టం తెలిసి ఉండాలని మండలంలోని కలవపాముల థెరిస్సా అకాడమీ డైరెక్టర్ రేవంత్ తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులకు వ్యవసాయం పట్ల అవగాహన కలిగించేందుకు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలకు బుధవారం ఆయన విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ మనం తింటున్న తిండి ఎంత కష్టపడితే వస్తుంది అనే అవగాహన విద్యార్థులకు కలిగి ఉండాలని సూచించారు. వరి ధాన్యం తయారీకి అయ్యే ప్రక్రియను రైతుల ద్వారా విద్యార్థులకు చెప్పించారు వరి నాట్లు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం అభినందనీయమని రైతులు అన్నారు.

# కందుకూరులో గంజాయి విక్రయ దారుడు అరెస్ట్




**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరుకు గంజాయి సరఫరా చేస్తున్న కట్టా యోహాను అనే యువకుడిని మంగళవారం రాత్రి అరెస్టు కందుకూరు సిఐ షేక్ అన్వర్ భాష ఆధ్వర్యంలో కందుకూరు ఎస్సై శివ నాగరాజు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం కందుకూరులో బుధవారం తన కార్యాలయము నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో గంజాయి కేసులో పట్టుబడిన వాళ్లు ఇచ్చిన సమాచారం మేరకు కావలి ముసునూరుకు చెందిన యోహానుని అరెస్ట్ చేసి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఒడిశా నుంచి బైక్పై గంజాయి తెచ్చి కందుకూరు, కావలి ప్రాంతాలకు సరఫరా చేస్తుంటాడని తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం హెచ్చరించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కందుకూరు పోలీస్ సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ షేక్ అన్వర్ భాష, ఎస్సై శివ నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో వేసిన కేసులో చంద్రబాబుకు హైకోర్టులో ఊరట



**అమరావతి, కలంకౌంటర్ :** ఏపీ రాజధానిలోని అసైన్డ్ భూముల విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇరువురిపై సీఐడీ నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. అసైన్డ్ భూముల్లో అవకతవకలు జరిగాయంటూ 2021 ఫిబ్రవరి 24న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఏపీ అసైన్డ్ భూముల బదిలీ నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్ల కింద చంద్రబాబు, నారాయణపై గతంలో సీఐడీ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌కు ఎలాంటి ఆధారాలు లేవంటూ సీఐడీ నమోదు చేసిన కేసును హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ తీర్పుతో చంద్రబాబు, నారాయణ ఊరట పొందారు. మరోవైపు, వైసీపీ పాలనలో రాజకీయ కక్షతో కేసులు నమోదు చేశారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. హైకోర్టు తీర్పు తమపై వేసిన అన్ని ఆరోపణలను తిప్పికొట్టిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పోర్టుల అభివృద్ధే మా లక్ష్యం... ప్రైవేటీకరణ కాదు

● రామాయపట్నం పోర్టుపై వైసీపీ అసత్య ప్రచారాలు ● పీపీపీ విధానం ద్వారా పారదర్శకంగా, వేగంగా పోర్టు అభివృద్ధి ● ఈ డిసెంబర్ నాటికి పోర్టు నిర్మాణం పూర్తి ● ఆర్ అండ్ బి శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి విమర్శలు



**కందుకూరు,కలంకౌంటర్ :** పోర్టుల అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పన అనే లక్ష్యాలతో అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానం (పీపీపీ )పై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేయడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు ఒ పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేకించి రామాయపట్నం పోర్టును ప్రైవేటుకు అప్పగిస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తున్నారని వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల్లో అపోహలు, భయాందోళనలు సృష్టించడం తప్ప దీనిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు.బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.... పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు, ప్రభుత్వ ఆస్తులు, హక్కులను వదులుకోవడం కాదు. ప్రభుత్వ యాజమాన్యంలో మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్వహించడం. ఈ విధానంలో పోర్టు యాజమాన్యం, భూమి, సముద్రతీర హక్కులు, భద్రత, విధాన నిర్ణయాలు, టారిఫ్‌లు, చట్టబద్ధ నియంత్రణలు, పర్యావరణ ప్రమాణాలు సహా అన్ని కీలక అధికారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. ప్రైవేట్ భాగస్వామి ప్రభుత్వ నిర్దేశించిన షరతులకు లోబడి నిర్వహణ బాధ్యతలను మాత్రమే నిర్వహిస్తారు. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అధికారం, అవసరమైతే ఒప్పందాన్ని రద్దుచేసే పూర్తి హక్కు కూడా ప్రభుత్వానికే ఉంటుంది. దేశంలోని విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, మెట్రో రైలు వ్యవస్థలు, పారిశ్రామిక పార్కులు, ప్రధాన పోర్టులు సహా అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు పీపీపీ విధానంలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. పోర్టు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్‌లు, ఎగుమతి కేంద్రాలు అభివృద్ధి చెందుతాయి. స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జగన్ ప్రభుత్వంలో పోర్టు పనులు పూర్తయింది నిర్మాణం 50 శాతమే. కూటమి ప్రభుత్వంలో 30 శాతం పైగా పనులను పూర్తి చేసాం. గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశాం. రామాయపట్నం పోర్టు ప్రాజెక్టులో రాష్ట్ర మారిటైమ్ బోర్డు అన్ని దశల్లోనూ, మొత్తం 19 బెర్తులపై 12 శాతం నాన్-డైల్యూటబుల్ ఈక్విటీ వాటాను శాశ్వతంగా కొనసాగిస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ వాటా తగ్గదు. భూమిని ప్రైవేట్ సంస్థకు విక్రయించడం కాకుండా లీజు ప్రాతిపదికన మాత్రమే వినియోగ హక్కులు కల్పిస్తున్నాం. గంగవరం పోర్టులో రాష్ట్రానికి ఉన్న 10.4 శాతం వాటాను అదానీ గ్రూప్‌కు విక్రయించింది అప్పటి వైసీపీ ప్రభుత్వమే కాదా? అలాగే 2023లో జె ఎస్ డబ్ల్యూ కు రెండు బెర్తులను ఏ ప్రాతిపదికన కేటాయించారు? ఈ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పిన తర్వాతే ప్రభుత్వంపై విమర్శలు చేస్తే బాగుంటుంది.పీపీపీ విధానం వైసీపీకి సమస్య కాదు. రాష్ట్ర అభివృద్ధే అసలు సమస్య. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు రావడం వారికి ఇష్టం లేదు. ప్రభుత్వ ఆదాయం పెరగడం ఇష్టం లేదు. ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై అసత్య ప్రచారం చేయడం, ప్రజలను భయపెట్టడం, పెట్టుబడిదారులను నిరుత్సాహపరచడం వైసీపీ రాజకీయ అజెండాగా మారింది. 2026 డిసెంబర్ నాటికి రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయడమే తమ లక్ష్యం. పోర్టును ప్రపంచస్థాయి ఆల్-వెదర్, మల్టీ-కార్గో పోర్టుగా అభివృద్ధి చేస్తాం. 2,538.42 ఎకరాల్లో, 19 బెర్తులతో, 138.54 ఎం ఎం టి పి ఏ సామర్థ్యంతో అభివృద్ధి చెందుతున్న రామాయపట్నం పోర్టు ద్వారా సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు, 25 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి.... అని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

# ముద్రగడకు రాష్ట్ర కాపు సేన లీగల్ సెల్ ఘన నివాళులు...



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కాపు రిజర్వేషన్ పోరాట సమితి యోధుడు పెద్దలు ముద్రగడ మరణం కాపు కుటుంబాలకు తీరని లోటు అని రాష్ట్ర కాపు సేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. బుధవారం మచిలీపట్నంలో బాలాజీమాట్లాడుతూ శాసనసభ్యులుగా పార్లమెంట్ సభ్యుడిగా మంత్రిగా రాష్ట్రంలో అనేక ఉద్యమాలకు ముందుండి నడిపించిన ముద్రగడ త్యాగాలను కాపులు మర్చిపోలేరని బాలాజీ అన్నారు. కాపు కుటుంబాలలో తనకంటూ ఒక పేజీని ఏర్పాటు చేసుకున్న ముద్రగడ జీవిత చరమాంకంలో కొన్ని క్షుద్ర రాజకీయాల వలన కాపులకు దూరం కావడం బాధాకరమని బాలాజీ అన్నారు. ఏది ఏమైనా కాపులకు రిజర్వేషన్ ఉండాలి అని ఇచ్చిన ముద్రగడ నినాదం అందరికీ అన్ని రాజకీయ పార్టీలకు స్ఫూర్తిదాయకమని అన్ని రాజకీయ పార్టీలు కాపు రిజర్వేషన్ కోసం కృషి చేయాలని బాలాజీ అన్నారు. నీతి నిజాయితీతో తన రాజకీయ జీవితం నేటి తరానికి గుర్తుండే విధంగా ముద్రగడ కొనసాగించారని బాలాజీ అన్నారు

# సమ్మిళిత పట్టణాభివృద్ధిపై ఏపీ ఎంఓయూ

● యూఎన్ హ్యాబిటాట్ తో ఏపీ ప్రభుత్వ ఒప్పందం

● సీఎం చంద్రబాబు- యూఎన్ హ్యాబిటాట్ ఈడీ సమక్షంలో ఎంఓయూ

**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఏపీ ప్రభుత్వం-ఐక్యరాజ్య సమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలకమైన అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ ల సమక్షంలో ఈ వ్యూహాత్మక ఒప్పందాన్ని ఏపీ పురపాలక శాఖ-యూఎన్ హ్యాబిటాట్ సంస్థలు కుదుర్చుకున్నాయి. ఆమె సింగపూర్ నుంచి వర్చువల్ గా ఈ ఎంఓయూ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ విధానాల్లో భాగంగా అమరావతిలో పట్టణ వ్యవహారాలపై ఓ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేయడంతో పాటు పేదరిక నిర్మూలన, పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపరచటం లాంటి అంశాలను చేపట్టేలా ఈ ఒప్పందం చేసుకున్నారు. ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర పర్యావరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్సు, మున్సిపల్ ఫైనాన్స్ తో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఏపీ ప్రభుత్వం- యూఎన్ హ్యాబిటాట్ తో కలిసి పనిచేయనుంది. దీంతో పాటు 2028లో మెక్సికోలో జరుగనున్న 14వ వరల్డ్ అర్బన్ ఫోరమ్ సదస్సులో ఏపీ విజయాలను ప్రపంచవేదికపై ప్రదర్శించాలని నిర్ణయించారు.

**అమరావతిలో గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్..** అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. సర్జ్ ఏపీ, రైజ్ ఎపీ, అప్ లిఫ్ట్ ఏపీ సహా పట్టణ పేదరిక నిర్మూలనపై యూఎన్ హ్యాబిటాట్ తో కుదుర్చుకున్న ఒప్పందం చారిత్రాత్మకం అవుతుందని సీఎం అన్నారు. జీరో పావర్టీ పై ఓ రోడ్ మ్యాప్ నిర్దేశించుకుని ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు సీఎం వివరించారు. అర్బన్ ప్లానింగ్ సహా ఆర్థికాభివృద్ధి పై మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటున్నట్టు తెలిపారు. బయోడైవర్సిటీని సంరక్షించేలా గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తి కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామన్నారు. అర్బన్ ప్లానింగ్, లివబిలిటి, డిజిటల్ గవర్నెన్సులో ఏపీ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. బెస్ట్ ప్రాక్టీసెస్ బ్రాండ్ అంబాసిడర్ గా తాను వ్యవహరిస్తానని సీఎం అన్నారు. మరోవైపు రాజధాని అమరావతి నిర్మాణం సీఎం చంద్రబాబు విజన్ కు ప్రతిరూపంగా ఉందని, ఏపీ -యూఎన్ హ్యాబిటాట్ మధ్య కుదిరిన ఒప్పందం చారిత్రాత్మకమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ వ్యాఖ్యానించారు. వ్యర్థాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ, బహిరంగ ప్రదేశాల అభివృద్ధి తదితర అంశాలపై ఏపీతో కలిసి పనిచేస్తామని అన్నారు.

# జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు ఆ కుటుంబం మొత్తాన్ని చంపేశాయి

-జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు యాదవ్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్రూరమైన మనస్తత్వం మరోసారి బయటపడిందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు యాదవ్ మండిపడ్డారు. శ్రీకాకుళంజిల్లా పలాసలో నిరుపేద గొర్రెల కాపరి బైక్ ప్రమాదంలో మృతి చెందిన దానయ్య కుటుంబం పట్ల సానుభూతిచూపి ఆదుకోకపోగా బైక్ తో ఢీ కొట్టిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ 18 ఏళ్ల చిన్నపిల్లవాడని ఇటువంటివి సహజంగా జరుగుతాయి. 18 ఏళ్ల కుర్రవాడు ఢీ కొట్టి చంపేస్తే తప్పులేదుఅన్నట్టుగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడినతీరు చాలా హాస్యాస్పదంగా ఉందని చట్టాలను అపహాస్యం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు సభ్య సమాజానికి సిగ్గుచేటని గడ్డం రాజు పేర్కొన్నారు . ప్రమాదం జరిగి తన వల్ల మరొకరు చనిపోవాలని ఎవరు అనుకోరని అప్పలరాజు కుమారుడు ఆరవ్ యాక్సిడెంట్ చేసి ఒకరి మరణానికికారణమైనాడని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ ను తప్పించి సిద్ధార్థ్ అనే యువకుడుని ఇరికించడం నేరం కాదా అని గడ్డంరాజు ప్రశ్నించారు . మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పలరాజు కుమారుడు ఆరవ్ చిన్న పిల్లవాడని ఆరవ్ యాక్సిడెంట్ చేసి దానయ్య మృతికి కారణమైనప్పటికీ 18 ఏళ్ల చిన్నారి మీద కేసులు పెడతారా అని పోలీసు వ్యవస్థ పై చట్టాలపై ఏమాత్రం అవగాహన లేని విధంగా జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని కోడి కత్తి కేసులో ఇదే వైఖరి ఎందుకుచూపలేదని గడ్డం రాజు జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. మృతి చెందిన దానయ్య కుటుంబానికి న్యాయం జరగాలని గొర్రెల కాపరిగా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని దానయ్య కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు దేనని కొడుకును కాపాడుకోవడంలో పెట్టిన శ్రద్ధ మృతి చెందిన దానయ్య కుటుంబాన్ని ఆదుకోవడంలో చూపి ఉంటే బాగుండేదని మానవత్వం మచ్చుకైనా వైసిపి అధినాయకులకు గాని కింద నాయకులు గాని లేదని మరోసారి జగన్మోహన్ రెడ్డి, అప్పలరాజు వ్యవహరించిన తీరుతో తేటతెల్లమైందని గడ్డంరాజు విమర్శించారు.

# అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్వు పంపిణీ



**బంటుమి ల్లి,కలంకౌంటర్ :** పెడన నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మరింత నాణ్యమైన మరియు పరిశుభ్రమైన పోషకాహారం అందించే లక్ష్యంతో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) ఆధ్వర్యంలో బంటుమిల్లి గ్రామంలో ఇండక్షన్ స్టవ్లు, వంట పాత్రల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత ప్రసాద్ మాట్లాడుతూచిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు బలమైన పునాదులు అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణంలో పోషకాహారం అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం దశలవారీగా కల్పిస్తోందన్నారు. పెడన నియోజకవర్గ పరిధిలోని 288 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు మరియు వంట పాత్రలను అందజేస్తున్నట్లు కాగిత చెప్పారు. ఈ సదుపాయాల ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో వంట ప్రక్రియ మరింత సులభతరంగా, పరిశుభ్రంగా నిర్వహించడానికి అవకాశం కలుగుతుందన్నారు. మన చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రతి లబ్ధిదారునికి మెరుగైన సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తామనీ ఎమ్మెల్యే కాగిత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సముద్రవేణి, అంగన్వాడీ టీచర్లు ఆయాలు కూటమి నాయకులు పాల్గొన్నారు

# అక్షర యోధుడు రవికుమార్ కు జన్మ దిన శుభాకాంక్షలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సోమయాజి వైశ్య సమాజం ఆధ్వర్యంలో చిరు సత్కారం
జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికుమార్ చేశారు. ఈ కార్యక్రమం లో తుమ్మలపల్లి శ్రీనివాస్,
జన్మదినోత్సవం సందర్భంగా మచిలీపట్నం శ్రీ లక్ష్మీ నృసింహ జయవరపు ప్రసాద్, పొట్టూరి కిరణ్ పాల్గొన్నారు.

# సేవకు మరో పేరు స్ఫూర్తి ఫౌండేషన్..



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ఏడాదికి 119 సేవా కార్యక్రమాలు నిర్వహించిన" స్ఫూర్తి ఫౌండేషన్" ప్రథమ వార్షికోత్సవ అభినందన సభ బుధవారం మచిలీపట్నం భాస్కరపురం ది ఎవిలిన్ ఫర్ గర్ల్స్ హాస్టల్లో జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలలో అన్నదానం, రక్తదానం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులు పంపిణీ, పేదలకు బట్టలు పంపిణీ, విద్యా సహాయం వృద్ధుల సేవ వంటి అనేక కార్యక్రమాలతో నగర ప్రజల మనలను పొందిందని అన్నారు. ప్రతి ఒక్కరు తాము సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి ఖర్చు పెట్టాలని స్ఫూర్తి ఫౌండేషన్ వంటి సమస్యలు యువతరానికి ఆదర్శప్రాయమని అన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువకులు స్ఫూర్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసి 119 సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కొంత సమయాన్ని సంపదను సమయానికి వెచ్చించాలని బాలాజీ అన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రేమ్ మాట్లాడుతూ తల్లి తండ్రి లేని పిల్లలను చదివించడం ప్రోత్సహించటం మాధవ సేవకు సమానమని అటువంటి అనేక కార్యక్రమాలు నిర్వహించిన స్ఫూర్తి ఫౌండేషన్ రాబోయే రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ పి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ సహాయం కన్నా స్వచ్ఛంద సంస్థలు సహాయం తక్షణమే బాధితులకు అందుతుందని అన్నారు స్ఫూర్తి సహాయ కార్యక్రమంలో పాల్గొన్న అవకాశం కలిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు వేణు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఐదుగురికి కృతిమ కాళ్ళు ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలకలపూడి సీఐ షేక్ అబ్దుల్ నబీ సర్కిల్ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ.ఎస్.ఎన్. రాధిక తదితరులు ప్రసంగించారు ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్.ఫణికుమార్ కార్యదర్శి బి రాము సభ్యులు కే. స్వర్ణలత ఐ.సుధాకర్, కే. మణిబాబు, టి.నరేష్, జి. భాను, న్యాయవాది లంకి శెట్టి సాయి ఫణి సంతోష్ మాదిరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మల్కాపట్నంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com